https://vijayamdaily.com

# విజయం

పేజీలు : 08

• అక్షర సమరానికి నాంది..

ఖమ్మం
భద్రాద్రి
కొత్తగూడెం

మంగళవారం / ఏప్రిల్ 25/ 2023

https://vijayamdaily.com



(ఖమ్మం ప్రతినిధి-విజయం న్యూస్)

"తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటి శాసనసభలో 1 లక్ష 7వేలు ఖాళీలు ఉన్నాయని కేసీఆర్ చెప్పారు. వాటిని సంవత్సరంలోగా భర్తీ చేస్తామన్నారు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నియమించిన బిశ్వాల్ కమిటీ 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని నివేదిక ఇచ్చింది. అంటే తొమ్మిదేళ్లలో ఉన్న ఉద్యోగాలు పోయాయి తప్ప.. కొత్త ఉద్యోగాలు రాలేదు" అని కేసీఆర్ పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు.

## ఉద్యోగాలు పోయాయి తప్ప..
# కొత్త ఉద్యోగాలు రాలే..

- 50 లక్షల మంది నిరుద్యోగులతో ప్రభుత్వం చెలగాటం
- ప్రశ్నపత్రాలు బజార్లో దొరుకుతున్నాయి
- తెలంగాణ నిరుద్యోగులకు అండగా ప్రియాంక గాంధీ
- ఖమ్మం నిరుద్యోగ నిరసన ర్యాలీలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

సోమవారం ఖమ్మంలో ఇల్లందు క్రాస్ రోడ్ నుంచి మయూరి సెంటర్ వరకు జరిగిన నిరుద్యోగ నిరసన ర్యాలీలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మయూరి సెంటర్ వద్ద నిర్వహించిన జనసభలో ప్రసంగించారు. ఖమ్మం జిల్లా నుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రారంభమైందన్నారు రేవంత్. 1969లో కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్'కోసం అక్కడి ప్రాంత వాసులు 1300 ఎకరాలను ఇచ్చారు. అయినా స్థానికులకుకాకుండా ఆంధ్రా ప్రాంతం వారికి ఉన్నత ఉద్యోగులు ఇవ్వడం ప్రారంభించారు. ఈ అన్యాయాలను

3లో..



## ఖమ్మంలో పదికిపది
# గెలుస్తాం..!

- రాష్ట్రంలో 90 సీట్లు గెలుపు ఖాయం
- ఉడత ఊపులు ఊదితే సహించం
- పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి
- నిరుద్యోగ దీక్ష అద్భుతంగా సక్సెస్
- భారీగా తరలివచ్చిన జనం

(ఖమ్మం ప్రతినిధి-విజయం న్యూస్)

ఖమ్మంలో పదికి పది సీట్లు తీసుకోస్తారా..? అందుకు మీరు సిద్ధమా..? అంటూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అడిగితెలుసుకున్నారు. ఖమ్మం బస్టాండ్ సమీపంలో జరిగిన కార్నర్ మీటింగ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో 2లో..

# సీతారామ ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలి



## బుగ్గపాడులో జరుగుతున్న పనులను పరిశీలించిన కలెక్టర్

ఖమ్మం, ఏప్రిల్ 24(విజయం న్యూస్):

సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం కలెక్టర్ సత్తుపల్లి మండలం బుగ్గపాడులో జరుగుతున్న సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 3లో..

# గడ్డి పెడుతున్రు

- ఎన్ఎస్ పీ కాలువలకు లీకేజీలు
- వాటిని నిలిపేందుకు కట్టి అడ్డుకట్ట
- అయినా ఆగని లీకేజీ

3లో..



(కూసుమంచి-విజయం న్యూస్)

కూసుమంచి మండలంలోని పాలేరు పాత కాలువకు ఆవుట్ ఫాల్ గేట్లు పెయిలూర అయ్యి, నీరు వధాగా దిగువకు వెళ్లిపోతున్నాయి. వీటిని గుర్తించిన స్థానికులు ఎన్ఎస్ పీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన పీసీసీ సభ్యులు కనీసం పట్టించుకోను కూడా పట్టించుకోవడం లేదు. నిజమే వృధాగ పోయే నీటిని కట్టి పెట్టేందుకు అసామాన్య ఇంజనీర్ల ఆదేశాలతో పూసలను మూటలుగా కట్టి సిద్ధం చేస్తున్న గడ్డి మోపుల చిత్రాలివి... ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరానికి నీరిచ్చేందుకు ఎంతో ప్రయాసతో సీతారామ నూ పాలేరు పాదాలకు



# ప్రతి పేదవానికి నాణ్యమైన వైద్యాన్ని అందించడమే లక్ష్యం

- కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం సూపర్ సక్సెస్ అయ్యింది
- పేదల కోసమే ప్రభుత్వ పథకాలు
- ప్రతిపక్షాలకు చేతగాక ప్రభుత్వంపై ఆరోపణలు
- సత్తుపల్లిలో పర్యటించిన మంత్రి హారీష్ రావు

ఖమ్మం, ఏప్రిల్ 24(విజయం న్యూస్):

ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం కల్లురులో మంత్రులు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్ విస్తృతంగా పర్యటించారు. హైదరాబాద్ నుండి హెలికాప్టర్ ద్వారా కల్లూరు చేరుకున్న వారు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కల్లూరు మండల కేంద్రంలో రూ.10.50 2లో..

# ప్రతి పేదవానికి నాణ్యమైన వైద్యాన్ని అందించడమే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి..**

కోట్లతో నిర్మించనున్న 50 పడకల ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. అనంతరం కల్లూరులో రూ.1.93 కోట్లతో నూతనంగా నిర్మించనున్న పర్యవేక్షక ఇంజనీర్, నీటి పారుదల శాఖ కార్యాలయ భవనాన్ని శంకుస్థాపన చేశారు. అనంతరం పెనుబల్లిలో రూ. 7.50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 50 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పెనుబల్లిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖల మంత్రి తన్నీరు హరీష్ రావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి అత్యంత ప్రాముఖ్యత నిచ్చి, పేదవానికి నాణ్యమైన వైద్యం ఉచితంగా అందాలని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని ఆధునిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. 6 నెలల క్రిందట ఇచ్చిన మాట ప్రకారం కల్లూరు లో ప్రభుత్వ ఆసుపత్రికి అప్ గ్రేడ్ చేసి, నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ. 10.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రూ. 36 కోట్లతో సత్తుపల్లి లో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం శరవేగంగా జరుగుతున్నట్లు, ఒక్కొక్క ఏఎన్ఎం సబ్ సెంటర్ కి రూ. 20 లక్షల. వ్యయంతో 26 సబ్ సెంటర్లు నిర్మాణంలో ఉన్నట్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మరమ్మతులకు రూ. కోటి మంజూరు చేసినట్లు, ఐసియు, డయాలసిస్ సేవలు సత్తుపల్లి లో అందుబాటులో తెచ్చినట్లు మంత్రి అన్నారు. ఈ సంవత్సరం ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల కు ఈ సంవత్సరం అనుమతి మంజూరు అయినట్లు, ఈ జూలై లో తరగతులు ప్రారంభం కానున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్రంలో 2,950 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, ఇప్పుడు 8,000 సీట్లు ఉన్నాయన్నారు. గతంలో 20 సంవత్సరాలకు ఒక్క వైద్య కళాశాల ఏర్పాటు అయితే, గత సంవత్సరం లో 8, ఈ సంవత్సరం లో 9, రెండు సంవత్సరాల్లోనే 17 వైద్య కళాశాలలు ఏర్పాటుచేసుకున్నామన్నారు. వైద్య విద్యకు ప్రోత్సాహం ఇస్తూ, పీజీ, స్పెషలిస్టు సీట్లను డబుల్ చేసుకున్నామన్నారు. కళ్యాణలక్ష్మి, ఆరోగ్యలక్ష్మి, మిషన్ భగీరథ, ఈ నెలలో భూమి ఉన్నవారు ఇల్లు కట్టుకునే పథకం గృహాలక్ష్మి, ఇలా ఏ పథకం అయినా మహిళల గురించి ఆలోచించి అమలుచేస్తున్నట్లు ఆయన అన్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం చేపట్టి, ప్రతి మంగళవారం మహిళలకు మహిళా డాక్టర్లు, మహిళా సిబ్బందిచే వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆయన





తెలిపారు. క్రొత్తగా కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం ఖమ్మం జిల్లాలో వారం, పది రోజుల్లో ప్రారంభించనున్నట్లు ఆయన అన్నారు. బిడ్డ పుట్టాక కేసీఆర్ కిట్ పథకం, బిడ్డ కడుపులో పడగానే కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం ప్రభుత్వం అమలుచేస్తున్నట్లు ఆయన తెలిపారు. పేదలకు ఏం కావాలో ఎప్పటికప్పుడు ఆలోచిస్తూ, అమలుచేస్తున్నది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమని మంత్రి అన్నారు. కంటి వెలుగు, ఆసరా, రైతు బంధు, రైతు భీమా, ఉచిత కరంట్, మిషన్ కాకతీయ లాంటి ఎన్నో పథకాలు ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఇంట్లో పథకాలు, ప్రతి ఒక్కరికి పథకాల లబ్ధి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందజేస్తూ, దేశానికి మార్గదర్శనం చేస్తూ, దేశం గర్వించేలా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన అన్నారు. మరో 3-4 నెలల్లో సీతారామ ప్రాజెక్ట్ నీళ్లతో సత్తుపల్లి చెరువులు, కుంటలు నింపుకుంటామని, కృష్ణా, గోదావరి నదుల అనుసంధానం జరుగబోతుందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం వైద్య కళాశాల ఏర్పాటుకు పూర్తి స్థాయి అనుమతుల ఉత్తర్వులను రాష్ట్ర రవాణా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు నామా నాగేశ్వర రావు, వద్దిరాజు రవించంద్ర, బండి పార్థసారథి రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, జెడ్పి చైర్మన్ లింగాల కమల్ రాజ్, టీఎస్ఎంఎస్ఐడిసి చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, డీసీఎంఎస్ ఛైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్. వారియర్, టీఎస్ఎంఎస్ఐడిసి సిఇ పి. రాజేందర్ కుమార్, ఎస్ఇ పి. దేవేందర్ కుమార్, ఇఇ ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు, ఇర్రిగేషన్ సిఇ శంకర్ నాయక్, ఎస్ఇ ఆనంద్ కుమార్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో పదికిపది గెలుస్తాం

**మొదటి పేజీ తరువాయి..**

పీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కాంగ్రెస్ ఖిల్లా అని, కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన కార్యకర్తల బలముం దన్నారు. ఆ కార్యకర్తల కోసం కాంగ్రెస్ అద్భుతంగా అండగా ఉంటుందని, హక్కున చేరుకుంటామని అన్నారు. మీరు చేయాల్సి ఒక్కటే పని ఉందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పదికి పది సీట్లు వస్తాయని తెలిపారు. ఇప్పటి వరకు నేనే రాజు..నేనే మంత్రి అని చెప్పుకుంటున్న మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కు కాలం చెల్లే రోజులు రాకుండా ఉండవన్నారు. నాటి నుంచి నేను ఉంటున్నా అన్నా అంటే ఎంత వద్ద ర్యాలీ ఖమ్మం వరకు రావాలని కోరారు. కొడుకును మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటే కేసీఆర్ నాకు నోటీసులు పంపించండి అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని, ఇలాంటి తుమ్మితే ఊడిపోయే కేసులకు కార్యకర్తలు భయపడతారా అని ప్రశ్నించారు. ఖమ్మంలో కార్పోరేటర్ల భర్తలు ముస్తాఫా, నరేంద్రలనపై అక్రమ కేసులు బనాయిస్తే భయపడి పారిపోయి పార్టీ మారారా..? అని ప్రశ్నించారు. నాపై ఇప్పటికే..130 కేసులు పెట్టినవ్ కేసీఆర్... ఇంతకంటే ఇంకేం చేస్తాం అని అన్నారు. హైదరాబాద్ లో జరిగే నిరుద్యోగ నిరసన సభకు ప్రియాంక గాంధీ హాజరవుతారని తెలిపారు. ప్రియాంక గాంధీ సభను విజయవంతం చేయాలని ఖమ్మం జిల్లా ప్రజలను కోరుతున్నానని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఒంటి కన్ను



శివరాసన్ ను పాతాళానికి తొక్కేయాలని సూచించారు.

**గాజులు కాదు.. విష్ణు వారియర్ : మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరి**

తమ్ముడూ రేవంత్ ఖమ్మం జిల్లాకు వెలుగున వచ్చి నిరుద్యోగ యువతలో వెలుగు నింపారు. ఖమ్మం జిల్లా కాదు ఇది కాంగ్రెస్ జిల్లా అని అన్నారు. గాంధీ కుటుంబం ప్రజల కోసం ఎన్నో పథకాలను తీసుకువచ్చింది. కేంద్రంలో నరేంద్ర మోడీ దొంగ సర్టిఫికేట్లు చూపించి అధికారంలోకి వచ్చారని తెలిపారు. ఆ స్వాతంత్ర సమరయోధులకు బానిసలు అంతా సమానులు కాదు గుర్తుంచుకోవాలని, చెయ్యి గుర్తు మోడీ, కెసిఆర్ చేతుల్లో లేదు మన చేతుల్లోనే ఉంది ఈ చెయ్యిచేయ్యి కలుపుదా, కాంగ్రెస్ పార్టీని గెలిపిద్దాం అని అన్నారు.

**భారీ జన సమీకరణ.. సభ**

**సూపర్ సక్సెస్**

నిరుద్యోగల యువతియువకులకు ఉద్యోగాలు ఇస్తామని మాటిచ్చిన సీఎం కేసీఆర్ మాటతప్పినందుకు గానున జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిరుద్యోగ నిరసన ర్యాలీ సూపర్ సక్సెస్ అయ్యింది. ఖమ్మం జిల్లాకు వస్తున్న సందర్భంలో భారీగా జన సమీకరణ చేశారు. దీంతో ఖమ్మం జిల్లా సరిహద్దు ప్రాంతంలో 20వేలుమందితో జిల్లా పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గప్రసాద్, ఆధ్వర్యంలో స్వాగతం పలికారని అన్నారు. అనంతరం పొన్నెకల్లు గ్రామంలో భారీ జన సకమీకరణ చేయగా, అక్కడికొచ్చిన జనంతో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. అలాగే మాదవిరెడ్డి తన వర్గీయలుతో కలిసి నాయకన్ గూడెం సరిహద్దులో స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఇల్లందు క్రాస్ రోడ్డు వరకు మోటర్ సైకిల్ ర్యాలీతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇల్లెందు రోడ్డు నుంచి బస్టాండ్ సెంటర్ వరకు రేవంత్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ నేతలతో కలిసి రావాలని కోరారు.

# ఉద్యోగాలు పోయాయి తప్ప.. కొత్త ఉద్యోగాలు రాలేదు

మొదటి పేజీ తరువాయి..

కొలిశెట్టి రామదాసు వెలుగులోకి తెచ్చారు. మా ఉద్యోగాలు మాకు కావాలంటూ తెలంగాణ ఉద్యమం ఖమ్మం జిల్లాలోనే మొదలైంది. తర్వాత రవీంద్రనాథ్ అనే విద్యార్థి ఖమ్మం గాంధీ చౌక్లో దీక్ష చేశారు. ఇవన్నీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచాయని రేవంత్ అన్నారు. ఖమ్మం జిల్లా అనేక పోరాటలకు వేదికగా నిలిచింది. ఇక్కడి కమ్యూనిస్టులు కూడా అన్యాయాలపై పోరాటం చేశారు. కానీ వారందరూ ఇప్పుడు ఎవరి పక్కనో ఉన్నారు చూసుకోవాలని కమ్యూనిస్టులకు రేవంత్ చురకులు అంటించారు. రాష్ట్రంలో 50 లక్షల మంది విద్యార్థి నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోంది అని రేవంత్ రెడ్డి కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించారు. "నీళ్లు నిధులు నియామకాల కోసం తెలంగాణ రాష్ట్రం కావాలని కేసీఆర్ చెప్పిండు. తెలంగాణ వచ్చి తొమ్మిదేళ్లయినా నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదు. అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరగలేదు. తెలంగాణ నిరుద్యోగులకు, మేధావులకు, అమరుల కుటుంబాలకు నేను గుర్తు చేయదలచుకున్నా. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటి శాసన సభలో 1 లక్ష 7వేలు ఖాళీలు ఉన్నాయని కేసీఆర్ చెప్పారు. వాటిని సంవత్సరంలోగా భర్తీ చేస్తామన్నారు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నియమించిన బిశ్వాల్ కమిటీ 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని నివేదిక ఇచ్చింది. అంటే తొమ్మిదేళ్లలో ఉన్న ఉద్యోగాలు పోయాయి తప్ప.. కొత్త ఉద్యోగాలు రాలేదు" అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

తెలంగాణలో నిరుద్యోగుల జరుగుతున్న అన్యాయంపై ఎన్ఎస్ యూఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 2021 అక్టోబరులో మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతా చారి విగ్రహానికి నివాళులు అర్పించి నిరుద్యోగ జంగ్ సైరన్ మోంగించాం అన్నారు రేవంత్ రెడ్డి. మా పోరాట ఫలితంగానే 80 వేల ఉద్యోగాలు భర్తీ



చేస్తామని కేసీఆర్ ప్రకటించారు. కేసీఆర్ మారిందేమో అనుకున్నాం..కానీ ఇవాళ జరిగిందేంటో మీకు తెలిసిందే...రాష్ట్రంలో పదో తరగతి ప్రశ్నాపత్రాలు బజార్లో దొరుకుతున్నాయి.. టీఎస్పీఎస్సీ ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయి. అర్హత లేని వారి టీఎస్పీఎస్సీ సభ్యులుగా నియమించారని రేవంత్ విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చేలగాటమాడుతోంది. పంపకాల్లో తేడాలు వచ్చి విషయం బయటపడింది తప్ప ప్రభుత్వం చేసిందేం లేదు..మేం నిలదీస్తే విచారణ అధికారులు మాకు నోటీసులు ఇచ్చారు. కొడుకును మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటే కేసీఆర్ నాకు నోటీసులు పంపిండు..నాపై ఇప్పటికే..130 కేసులు పెట్టినవ్ కేసీఆర్... ఇంతకంటే ఇంకేం చేస్తావ్. నీ కేసులకు భయపడేటోడు ఎవడూ లేడు ఇక్కడి అని ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

తెలంగాణలో నిరుద్యోగులకు అండగా నిలవడానికి హైదరాబాద్ లో జరిగే నిరుద్యోగ నిరసన సభకు ఇందిరమ్మ మనుమరాలు ప్రియాంక గాంధీ హాజరవుతారు. ప్రియాంక గాంధీ సభను విజయవంతం చేయాలని ఖమ్మం జిల్లా ప్రజలను కోరుతున్నా. ఖమ్మం జిల్లాలో ఒంటి కన్ను శివరాసన్ ను పాతాళానికి తొక్కేయాలి. జిల్లాలో 10కి 10 సీట్లు కాంగ్రెస్ కు ఇవ్వండి.... రాష్ట్రంలో నూటికి 90 సీట్లు తెచ్చే బాధ్యత మేం తీసుకుంటామని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

### పిల్లలమర్రిలో రైతుల సమస్యలు తెలుసుకున్న రేవంత్

ఖమ్మం నిరుద్యోగ నిరసన ర్యాలీకి వెళ్లే క్రమంలో సూర్యాపేట జిల్లా పిల్లలమర్రి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆగి ధాన్యం కొనుగోలు తీరు తెన్నులను రైతులను అడిగి తెలుసుకున్నారు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి. ఈ సందర్భంలో రైతులు తమ కష్టాలను వారికి వివరించారు. అకాల వర్షాలతో తమ ధాన్యం తడిసి పోతున్నప్పటికి అధికారులు కొనుగోలు జరిపించడం లేదని వాపోయారు. వర్షాలకు తడిసిన ధాన్యం మొలకెత్తుతుందన్నారు. తడిసిన ధాన్యం కూడా ప్రభుత్వం కొనుగోలు చేసేలా చూడాలని మొరపెట్టుకున్నారు. గతంలో టార్పాలిన్ పట్టాలైన తమకు ఇచ్చేవారని ఇప్పుడు అవి కూడా ఇవ్వడం లేదన్నారు. పైగా ధాన్యం తూకం వేశాక కొనుగోలు కేంద్రం నుండి ధాన్యం బస్తాలు ఎగుమతి అయ్యేవరకు రైతులని బాధ్యులను చేస్తున్నారని, దీంతో తూకం వేసిన ధాన్యం బస్తాలను కూడా తామే వర్షాల నుండి కాపాడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. క్వింటాల్ కు ఐదు శాతం కోతలు పెడుతూ కూడా టార్పాలిన్లు ఇవ్వకుండా, తూకం వేసిన ధాన్యం బస్తాల బాధ్యతను తీసుకోకుండా రైతుల నెత్తిపై వాటి సంరక్షణ భారం మోపడం అన్యాయంగా ఉందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఐదు రోజులుగా తీసుకెళ్లడం లేదని, దీంతో అమ్మకానికి 20 రోజులకు పైగా కొనుగోలు కేంద్రంలో పడిగాపులు పడుతున్నామని, తూకం వేసాక కూడా బస్తాల ఎగుమతి జరిగే వరకు ఇక్కడే మరిన్ని రోజులు ఉండాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తుందని, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందన్నారు. రైతులు అధైర్య పడవద్దని, వారికి అండగా కాంగ్రెస్ నిలబడుతుందన్నారు. ఈ



కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర కమిటీ అధ్యక్షుడు మహ్మద్ జావిద్, మాజీ కేంద్ర మంత్రులు రేణుక చౌదరి, బలరాంనాయక్, వీహెచ్ హన్మంత్ రావు, మాజీ మంత్రులు సంభాని చంద్రశేఖర్, షబ్బీర్ అలీ, మాజీఎంపీ మల్లురవి, పీసీసీ ఉపాధ్యక్షులు వేం నరేందర్, పోట్ల నాగేశ్వరరావు, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, రాపోలు జైప్రకాష్, మానవత్ రాయ్, కొండేటి మల్లయ్య, రాయల నాగేశ్వరరావు, రాందాసు నాయక్, రామూర్తి నాయక్, యువజన రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, ఎన్ ఎస్ యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ తదితరులు హాజరైయ్యారు.

## గడ్డి పెడుతున్రు

మొదటి పేజీ తరువాయి..



తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చు చేస్తూ, యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తుంటే, వచ్చిన సాగర జలాలను నిల్వచేసుకునేందుకు, పనిచేయని చిన్న, పెద్దకాల్వల గేట్ల ద్వారా లీకేజ్ కాకుండా పడుతున్న ప్రయాస ఇది... గేట్ల నిర్వాహణ సరిగ్గా నిర్వహించక, ప్రతి సంవత్సరం అధికారులు చేస్తున్న ఈ ప్రయత్నానికి మనమూ నాలుగు గడ్డి పూసలేద్దాం....ఇక పాలకులు ఏలాగు బండెనక బండి కట్టి మోపులు తెస్తారుగా

## సీతారామ ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలి

ప్రాజెక్ట్ పనులు ముమ్మరంగా చేపట్టి, మూడు నెలల్లో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రాజెక్ట్ క్రింద ఖమ్మం జిల్లాలో 21 కి.మీ., భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 19 కి.మీ. మేర కాల్వ త్రవ్వకం పనులు జరుగుతున్నట్లు ఆయన అన్నారు. భూములు కోల్పోయిన వారికి నష్ట పరిహారం అందజేత చర్యలు వెంటనే పూర్తి చేయాలన్నారు. బుగ్గపాడు, రుద్రాక్షపల్లి, యాతర్లపాడు గ్రామాల్లో ఎర్రచందనం చెట్లకు మూల్యాంకనం వెంటనే పూర్తి చేయాలన్నారు. టన్నెల్ పనుల్లో వేగం పెంచాలని ఆయన తెలిపారు. మెషినరీ, పనివాళ్లను పెంచాలని, పనులు త్వరితగతిన పూర్తికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా కల్లూరు ఆర్డీవో సిహెచ్. సూర్యనారాయణ, ఇర్రిగేషన్ ఇఇ కె. సురేష్ కుమార్, డిఇలు చంద్రశేఖర్, మోతీలాల్, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఓ సుభాషిణి, అధికారులు తదితరులు ఉన్నారు.



# గొర్రెల పంపిణీ పథకం నగదు బదిలీ ద్వారా అమలు చేయాలి

## రాష్ట్ర ఆర్థిక మరియు వైద్య శాఖా మంత్రి టి.హరీష్ రావు కి జి.యం.పి.యస్ వినతి

## యన్ సి డి సి ఆమోదం కోసం ప్రయత్నిస్తున్నాం: మంత్రి హరీష్ రావు



(కల్లూరు-విజయం న్యూస్)

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకం పక్కదారి పట్టకుండా నగదు -బదిలీ ద్వారా అమలు చేయాలని గొర్రెల మేకల పెంపొందారుల సంఘం(జిఎంపిఎస్) జిల్లా నాయకత్వం రాష్ట్ర ఆర్థిక మరియు వైద్య శాఖా మంత్రి టి. హరీష్ రావు ని కల్సి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ వినతిపత్రం లో గత "ఏ" లిస్ట్ గొర్రెల పంపిణీలో మధ్య దళారులు, కొంతమంది అధికారులు మాత్రమే బాగుపడ్డారని, పథకం అస్సలు లబ్దిదారులైన యాదవ, కురుమలకు అన్యాయం జరిగిందని పేర్కొనడం జరిగింది. ఇప్పుడు ప్రారంభించబోయే "బి" లిస్టు గొర్రెల పంపిణీ కూడా పాత పద్దతిలోనే పంపిణీ చేపడతామని అధికారులు తెలిపారని దీని వలన మరలా లబ్ది దారులకు నష్టం జరుగుతుందని తెలిపారు. దీనికి తోడు ప్రతి ఒక్కరూ కుల ధ్రువీకరణ పత్రం తెచ్చుకోవాలని, మరణించిన సభ్యుల స్థానంలో ఫ్యామిలీ సర్టిఫికెట్ తీసుకురావాలని అధికారులు చెప్తున్నారని, ఇది సరైనది కాదు ఇప్పటికే 10 నెలలుగా డబ్బులు కట్టి ఎదురుచూస్తున్నవారికి దీనివలన మరింత కాలయాపన జరిగే అవకాశం ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.ఖమ్మం జిల్లాకు చిత్తూరు, నెల్లూరు, కర్నాటక జిల్లాలలో గొర్రెలు కొనుగోలు చేసి తీసుకురావాలని నిర్ణయించారని. ఇంత సుదూర ప్రాంతాల నుండి తీసుకొస్తే ఈ వేసవికాలంలో మార్గమధ్యంలోనే అనేకం చనిపోయే అవకాశం ఉందని. కావున ఇన్ని వ్యయ ప్రయాసలు లేకుండా మునుగోడు మాదిరిగా నగదు బదిలీ చేసి యాదవ, కురుమల కుటుంబాల అభివృద్ధికి పాటుపడాలని, ప్రభుత్వం తీసుకొచ్చిన పథకం లక్ష్యం నెరవేరేలాగా చూడాలని కోరనైనది. మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ నగదు బదిలీ అమలు చేయాలంటే యన్ సి డి సి ఆమోదం కావాలని ఇందు కోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఇతర సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో జిల్లా కార్యదర్శి తుశాకుల లింగయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మామిళ్ళ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు భట్టు నర్సింహారావు, గాయం తిరుపతిరావు, కృషార్జున్ రావు లు పాల్గొన్నారు.

# నేషనల్ హైవే పనులను త్వరగా పూర్తి చేయండి

## ఖమ్మం-దేవరపల్లి హైవే పనులను పరిశీలించిన కలెక్టర్, అధికారులు

ఖమ్మం, ఏప్రిల్ 24(విజయంన్యూస్):



నేషనల్ హైవే పనుల్లో వేగం పెంచి, నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ నేషనల్ హైవే చే ఖమ్మం-దేవరపల్లి 4 వరసల గ్రీన్ ఫీల్డ్ హైవే విస్తరణ పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పెనుబల్లి మండలం ముత్తగూడెం, కారాయిగూడెం, వేంసూరు మండలం వైఎస్ బంజార, చౌడవరం గ్రామాల్లో పర్యటించి, గ్రీన్ ఫీల్డ్ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ని 3 ప్యాకేజీల క్రింద చేపట్టినట్లు తెలిపారు. ప్యాకేజి-1 క్రింద 33.604 కి.మీ. రహదారి రూ. 1,060.97 కోట్ల అంచనాతో, ప్యాకేజి-2 క్రింద 29.513 కి.మీ. రహదారి రూ. 761.35 కోట్ల అంచనాతో, ప్యాకేజి-3 క్రింద 42.119 కి.మీ. రహదారిని రూ. 948.53 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్నట్లు ఆయన అన్నారు. ఇట్టి రహదారిలో 7 మేజర్, 30 మైనర్ వంతెనలు, ఒక ఆర్వోబి, 5 ఇంటర్ చేంజ్ ల నిర్మాణాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లింపులు ఉన్నచో వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. బుగ్గపాడు, రుద్రాక్షపల్లి, యాతర్లపాడు ల్లో ఎర్రచందనం మూల్యాంకనం వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రతి 250 మీటర్లకు అండర్ పాస్ ఏర్పాటు వుండాలన్నారు. పంట భూముల మధ్యలో నుండి రహదారి నిర్మాణం జరిగితే, అట్టి రైతు తన పంట భూమికిరువైపులా సులభంగా వెళ్లేలా ఏర్పాటుచేయాలన్నారు. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్, 2024 నాటికి పనులు పూర్తిచేసి అందుబాటులో వచ్చేలా చర్యలు వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా కల్లూరు ఆర్డీవో సిహెచ్. సూర్యనారాయణ, ప్రాజెక్ట్ రెసిడెంట్ ఇంజనీర్ అమరేందర్, మేనేజర్ దివ్య, క్యాంపు మేనేజర్ మహేష్, బ్రిడ్జి ఇంజనీర్ నారాయణ రావు, క్వాలిటీ ఇంజనీర్ నారాయణ, మండల తహసీల్దార్లు రమాదేవి, నారాయణ, అధికారులు తదితరులు ఉన్నారు.



# అమిత్‌షా వ్యాఖ్యలు సరికావు

## - ముస్లిం మైనార్టీ ప్రజల్లో అభద్రతాభావం

## - సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం, ఏప్రిల్ 24 (విజయంన్యూస్):

తెలంగాణలో అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని బిజెపి అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు సంకుచిత రాజకీయాలకు నిదర్శనమని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేషపూరిత ప్రసంగాలు చేయడం ద్వారా రాజకీయ లబ్ది పొందేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. ముస్లిం మైనార్టీ ప్రజల్లో అభద్రతా భావం పెంపొందేలా మాట్లాడటం దేశ విస్తృత ప్రయోజనాలను దెబ్బ తీస్తుందన్న విషయాన్ని గ్రహించాలని కోరారు. ముస్లింలు ఈ దేశ పౌరులేనని, ముస్లిం జనాభాలో చాలామంది అత్యంత నిరుపేదలని, చాలా దుర్భర జీవనం కొనసాగిస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, బిసిల మాదిరిగానే వారికి కూడా రాజ్యాంగం వారి సంక్షేమానికి, అభివృద్ధి చెందడానికి రిజర్వేషన్లు



కల్పించిందని, రాజ్యాంగబద్ధంగా వారికి కల్పించిన రిజర్వేషన్లను రద్దుచేస్తామని బహిరంగంగా ప్రకటన చేయడాన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని నున్నా తన ప్రకటనలో తెలిపారు. మొదటి నుండి బిజెపి%--%ఆరెస్సెస్ శక్తులు రిజర్వేషన్లకు వ్యతిరేకమని, ఇప్పుడు ముస్లిం రిజర్వేషన్లు రద్దుచేసి, వాటిని ఎస్సీ, ఎస్టీ, బిసి లకు అందచేస్తామని ప్రగల్బాలు మాట్లాడటం విడ్డూరమని అన్నారు. రాజ్యాంగాన్నే మార్చివేసి రిజర్వేషన్లు ఎత్తివేయాలని కేంద్రం చూస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని జన గణనలో కుల గణన చేయాలని, కులాల వారి లెక్కలు తీయాలని, అలా తీస్తే బిసి కులాల మధ్య వున్న వ్యత్యాసాలను తొలగించడానికి వీలవుతుందని అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నా చేయడం లేదని విమర్శించారు. నిజంగా బిజెపికి ఓబిసిలపై ప్రేమ వుంటే బిసి రిజర్వేషన్లపై వున్న 50% సీలింగ్ ఎత్తివేయాలని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థల్ని అప్పనంగా అదాని, అంబాని లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ, దేశ సంపదను దోచి పెడుతుందని మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వం ప్రజలను నయవంచన చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బిజెపి ఇలాంటి ప్రకటనలు చేయకుండా ప్రజల మధ్య చిచ్చు పెట్టే చర్యలు మానుకోవాలని నున్నా తన ప్రకటనలో కోరారు.

# నూతన హెల్త్ సబ్ సెంటర్ భవనాల నిర్మాణ పనులు పూర్తి చేయండి

### పెనుబల్లి మండలంలో భవనాల నిర్మాణ పనులను తనిఖీ చేసిన కలెక్టర్

ఖమ్మం, ఏప్రిల్ 24(విజయం న్యూస్):



నూతన హెల్త్ సబ్ సెంటర్ భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం కలెక్టర్ పెనుబల్లి మండలం వంగ ముత్యాల బంజర, పెనుబల్లిలలో నిర్మిస్తున్న భవనాల పురోగతిని క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. వంగ ముత్యాల బంజరలో హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. స్థల రికార్డులు తనిఖీ చేశారు. నీటి పారుదల శాఖకు దానం చేసిన పట్టాభూమిలో కొంత భాగాన్ని హెల్త్ సబ్ సెంటర్ కి కేటాయించినట్లు ఆయన అన్నారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని, భవన నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని ఆయన తెలిపారు. పెనుబల్లిలో నిర్మాణాన్ని పరిశీలించారు. త్వరలో పూర్తిచేసి అందుబాటులో తేవాలన్నారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా కల్లూరు ఆర్డీవో సిహెచ్. సూర్యనారాయణ, పీఆర్ ఇఇ చంద్రమౌళి, పెనుబల్లి తహసీల్దార్ రమాదేవి, అధికారులు తదితరులు ఉన్నారు.